# సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థముగాచించినప్పుడే జీవితము సార్థకమవుతుంది

దానధర్మము లేక దయయు సత్యము లేక
మానసంబున మంచి నీతి లేక
చెడుగుణంబులతోడ చెలరేగుచున్నట్టి
మనుజుడిలను పరమునందు సుఖంబులందలేడు.

**ప్రేమస్వరూపులారా!**

'ధృత్' అనే ధాతువునుండియే 'ధరణి' అనే పదము ఆవిర్భవించింది. 'ధరణి' అనగా ధర్మమును సమస్తలోకములకు యేకరీతిగా కట్టబెట్టినటువంటిది. సమస్త జగత్తును యేకరీతిగా నిలబెట్టినటువంటిది. "ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా" అనగా యిది ధర్మము, యిది ధర్మము అని స్వయముగా శాసించినది. 'ధర్మే సర్వ ప్రతిష్ఠితం', అనగా యిది ధర్మము అని స్వయముగా చెప్పే అధికారము గలది. ఈ ధర్మము ప్రత్యక్ష ప్రమాణములచేతగాని, అనుమాన ప్రమాణముల చేతగాని, చివరకు హేతువాదమునకుకూడా తెలియనిది. శబ్దప్రమాణమైన ఒక్కవేదము మాత్రమే దీనిని తెల్పుటకు అధికారము కలది.

**ధర్మమోక్షములు రెండూ అతీంద్రియములు, బుద్ధికి గోచరమయ్యేవి కావు.**

వేదమనగా ఏమిటి? వేద్యైతితి వేదః అనగా ప్రతి విషయముకూడను విపులముగా తెలియజేయునది. ధనుర్వేదము, ఆయుర్వేదము,నాట్యవేదము, సామవేదము అని అనేక విధములుగా యీ వేదములకు ముందు కొన్నిపదములు చేర్చి ఉచ్చరిస్తూ ఇది ప్రబోదిస్తూ వచ్చింది. అయితే, వేదమునకు పూర్వము ఉండిన పదముయొక్క శాస్త్రమును బట్టి ఆయా అంశములను ప్రబోధించునదే ఈ వేదమని స్పష్టమగుచున్నది. ఉదాహరణకు నాట్యవేదము. వేదమునకు పూర్వపదము నాట్యము. అనగా నాట్యశాస్త్రమును తెల్పునదే యీ నాట్యవేదము. ఆయుర్వేదము, ఆయుః అనే పదము వేదమునకు పూర్వము ఉండిన పదము కనుక ఈ ఆయువును గురించి చెప్పు శాస్త్రమే ఆయుర్వేదమని పేరు వచ్చింది. వేదము అనగా

sri sathyasai vachanamrutam

తెలియజేయునది అని అర్థము. దేనిని తెలియజేయును? వేదమునకు పూర్వపదము ఏదివున్నదో దానియొక్క శాస్త్రమును తెలియజేయును. అయితే ధర్మమోక్షములు రెండు కూడాను అతీంద్రియములు, బుద్ధికి గోచరమయ్యేవి కావు. ఆతీంద్రియ రూపము ధరించిన ఈ ధర్మమోక్షములయొక్క తత్వాన్ని యే విధముగా వేదము తెలియజేస్తుంది? డైరెక్టుగా ధర్మము, మోక్షము అనే వానిని తెలియజేసే అధికారము వేదమునకుకూడను లేదు. కనుకనే, 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః,' అనగా ధనముచేతగాని, సంపదచేతగాని యింకే విధమైన పుణ్యకర్మలచేతగాని యీ అమృతత్వమనే మోక్షము ప్రాప్తించదని వేదమే నుడివింది. అయితే యీ ధర్మమోక్షములనేని క్రియా రూపములో అనగా సత్కర్మలచేత ఆచరించబడి తద్వారా స్థానమును పొందే అధికారము కల్గినవి. కనుకనే దీనికి వేదమని పేరు వచ్చింది.

**జగత్తే ధర్మముచేత నిలుపబడినది**

వైదిక, లౌకిక కర్మలను రెండింటిని ప్రబోధించునది కనుకనే ధర్మమునకు ఒక విధమైన నూతనమైన పేరును మను చక్రవర్తి ప్రతిపాదించారు. అనగా మానవత్వములో నిత్యజీవితమును సత్యమార్గములో నడిపే నిమిత్తమై కర్మలాచరించే స్థానమునకు 'విధాన' అనే పేరును సృష్టించాడు. కానీ కలియుగమునందు కొన్ని ప్రజానీతులను, ప్రజాశాస్త్రములను, ప్రజా నిబంధనలను శాసించే లెజిస్లేటివ్ అసంబ్లీ భవనములకు విధాన సౌధములని పేరు పెడుతూ వచ్చారు. 'విధాన' అనగా శాసించే ప్రధానస్థానమని. యీ వేదముయొక్క తత్వాన్ని చక్కగా అర్థము చేసుకొనలేక నానార్థములను పెంచి అనర్థములను స్వీకరించి, యథార్థములు త్యజించి మానవత్వమును నిరర్థకము చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ధర్మమనే పదము చాలా విశాలమైనది. జగత్తునే ఆవరించినది. సమస్త జగత్తుకూడను ధర్మముచేత కట్టబడినది. జగత్తే ధర్మముచేత నిలుపబడినది. అట్టి సర్వవ్యాపకత్వమైన యీ ధర్మమును ప్రచారము చేయటములో వుండిన అంతరార్థము ఏమిటి? ఏదో కొన్ని స్థానములయందుండి, కొన్ని స్థానములలో లేని స్థితిలో వుండినప్పుడే లేని స్థానములో ప్రచారము చేయవలసివస్తుంది. సర్వత్రావుండిన స్వరూపమునకు తిరిగి ప్రచారమెందులకు?

srisathyasaivachanamrutam

**ధర్మము సరిగా ఆచరింపబడినప్పుడే ప్రచార ప్రబోధలకు అర్హతను సంపాదించుకుంటుంది.**

అయితే, ధర్మము సర్వత్రా వుండినప్పటికి నిప్పును నివురు కప్పినట్లుగా, నీళ్ళను పాచి కప్పినట్లుగా, కన్నును పొర కప్పినట్లుగా ధర్మమును అజ్ఞాన అహంకార, మమకారములనే నివురుచే కప్పియుండటంచేత యీనివురును తీసివేసి నిజమైన స్వరూపమును ప్రపంచమునకు నిరూపింపచేయటమే దీనిలో అంతరార్థము. దానికే ప్రచారమని పేరుపెడుతూ వచ్చారు. ధర్మప్రచారమనునది కేవలము లేనిదానిని ప్రచారము చేయటం కాదు. ఈ ప్రచారమునకు మూలాధారము ఆచారమే! మనసు ఆచరించినప్పుడే యీ ధర్మము సరైన స్థాయిలో ప్రచార, ప్రబోధలకు అర్హతను సంపాదించుకుంటుంది. నేడు జగత్తునందు ప్రచారప్రబోధలు సన్నగిల్లటంచేతనే ధర్మము, సత్యము, న్యాయము అనేవి అగోచరమై అదృశ్యమైపోయినాయి. అనగా ఏమిటి? కన్పించటంలేదు. వున్నవి. కాని కన్పించటంలేదు. ఏ విధంగా? మట్టితో కప్పబడిన నీరు మనకు కంటికి కన్పించదు. నీటికి కంటికి మధ్యనున్న మట్టిని తీసివేసినప్పుడు ఆ నీరు కంటికి కన్పిస్తుంది. భూమిలో సర్వత్రానీరు యిమిడి వుంటుంది. అయితే యీ మధ్యలో వున్న మట్టియే ఆ నీటిని మనకు మరుగు చేస్తున్నది. అదే విధముగానే ధర్మమునకు, మనకు ఆచరణ అనేది లేకపోవటమే అడ్డు. ఆచరణపైన సంపూర్ణమైన విశ్వాసము లేకపోవటమే దీనికి అడ్డు. గ్రంథ ప్రచారములు అధికముగా జరుగుతూ వున్నవి. వాక్ ప్రచారములుకూడను అధికముగా జరుగుచున్నవి. కానీ, ఆచరణ స్వరూపమైన ప్రబోధలు సన్నగిల్లిపోయినవి. ఈ చిలకపలుకులవల్ల మానవునికి విసుగెత్తి హృదయము వేడెక్కి అనేక విధములైన సంధిగ్ధావస్థలో మునిగిపోతున్నాడు. కనుక ఈనాడు మనము ఆచరణరూపమైన రీతిలో ప్రచారము చేసినప్పుడే ఇది సక్రమమైన మార్గములో, సరైన రూపములో మనకు సాక్షాత్కరిస్తుంది.

**ప్రతి కర్మకు ఒక ఫలితము ఉంటుంది**

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, శ్రవణము అనగా కాలము, ఆత్మ, మనస్సు యివన్నీ కూడను ద్రవ్యస్వరూపములు. ద్రవ్యపదార్థములనగా యేమంటే తర్క శాస్త్రమునకు సంబంధించినవి. తర్కమనగా క్రియరూపములో నిరూపింపజేసేదే తర్కము. కనుకనే మంచి చెడ్డలు అనేవి క్రియరూపములో ఒక విధమైన ఫలితమును అందిస్తూంటాయి. ప్రతి కర్మకు

srisathyasaivacharamrutam

ఒక ఫలితము ఉంటుంది. అదే విధముగనే యీ మోక్షము, ధర్మము అనే స్వరూపాలకు కూడను కొన్ని ఫలితములుంటున్నాయి. అతను చాలా సద్గుణవంతుడని ఒకపేరు విన్నామంటే అతని యొక్క గుణముల లోపల వుండిన ప్రవర్తన ఆధారము చేసుకొనియే అతను సద్గుణవంతుడంటున్నాము. అతను సాత్త్వికి హృదయుడంటే ఏమి? అతనియొక్క ప్రవర్తన ఆధారం చేసుకొనియే మనమతనిని సాత్త్విక హృదయుడంటున్నాము. ఏతావాతా గుణకర్మలనాధారం చేసుకొనియే ఒక వ్యక్తియొక్క మంచి చెడ్డలను గురించి మనము అంచనా వేస్తున్నాము. దుష్టప్రవర్తనతో నున్నవానిని దుష్టుడంటున్నాము. సత్కర్మలలో ప్రవేశించిన వానిని సద్గుణవంతుడంటున్నాము. కనుక, గుణకర్మలనేవి మానవునికి అతి ప్రధానమైనవి. గుణకర్మస్వరూపమైనవాడే మానవుడు. ఈ గుణకర్మలనాధారం చేసుకొనియే వర్ణములు సృష్టించినాననికూడను అన్నాడు కృష్ణుడు. అయితే ఈ గుణకర్మలు మనము యేవిధంగా ఆచరించాలి? గుణమునుబట్టి కర్మలు. కర్మలను బట్టి గుణము. విత్తనమునుబట్టి చెట్టు, చెట్టునుబట్టి విత్తనము. ఇవి రెండుకూడను యేది మొదలు, యేది వెనుక అనేది చెప్పటానికి సాధ్యము కాదు. ఇది అన్యోన్యాశ్రయము, అవినాభావసంబంధము. కనుకనే మనయొక్క గుణములను సద్గుణములుగా మనం మార్చుకోవాలి.

రామకృష్ణానంద చెప్పాడు. ఎన్ని దినములనుండో, ఎన్ని సంవత్సరముల నుండో వస్తున్నారు. ఎన్నో ఉపన్యాసములు వింటున్నారు. ఎన్నియో ప్రబోధలు మీరు శ్రవణం చేస్తున్నారు. ఎంతకాలమో ఆశ్రమములో నివసిస్తున్నారు. కాని కల్గిన ఫలితము ఏమిటి? సాధించినదేమిటి? ఒక్కటిరెండైనా మనము ఆచరణలో పెట్టి చూపుతున్నామా? లేదు. అందువల్లనే యీలాంటి ఉపన్యాసములన్నీకూడను కేవలం హృదయమును వేడెక్కించేవే! జీవితముపైన విసుగుపుట్టించేవే! కాలమును వ్యర్థము గావించేవే! కర్మలో యిమడ్చని భావములు కేవలం కారడవిలో జీవించినవే. మనము ఏ రెండు మూడైననూ ఆచరణలో పెట్టటానికి ప్రయత్నం చేయాలి.

క్షమ, దయ, సత్య, ప్రేమ, సానుభూతులు మానవులందరికి సంబంధించినవి. ఏ దేశమువారైనా, ఏ కులమువారైనా యిదికాదు, అని చెప్పటానికి వీలులేదు. ఏ దేశమునకైనా, ఏ కాలమునకైనా, ఏ వ్యక్తులకైన యివి అత్యవసరమైనవి. ఇవి ఆత్మగుణములు. ఇట్టి

sri sathyasai vahini

గుణవంతుని ఎవరైన దుష్టుడు హింసించినప్పటికిని, కొట్టినప్పటికిని, తిట్టినప్పటికిని తాను ఆధైర్యమునకు స్థానమివ్వక, ఆవేశమునకు చోటివ్వక యీ శిక్షించేవానిని సైతం క్షమించే గుణమును పెంచుకోవాలి. ఏ రీతిగా పెంచుకోవాలి? మనోవాక్కాయములతో కూడను అతని నాదరించాలి. అదియే తితీక్ష అని చెప్తూతూ వచ్చాము. ఇట్టి తితీక్షను సాధించలేని మానవుడు యేమాత్రముకూడను దివ్యత్వమును సాధించలేడు. క్షమసత్యము, క్షమధర్మము, క్షమవేదము, క్షమఅహింస క్షమ సర్వస్వము సర్వలోకములందుకూడను క్షమ అనేది చాల విలువైనది.

**క్షమను సాధించాలంటే నాలుగు విధములైన శౌచములను పాటించాలి**

అయితే యిట్టి క్షమను మనము సాధించవలెనంటె మనము ముందుగా చేయవలసిన కర్మలెటువంటివి? ద్రవ్యశౌచము, మనోశౌచము, వాక్‌శౌచము, క్రియాశౌచము అనగా దేహశౌచము అనే నాలుగు రకాల శౌచములను మనం పాటించాలి. ముందుగా ద్రవ్యశౌచమంటే ఏమిటి? మనము ధరించే వస్త్రములు, భుజించే ఆహారము, వండేపాత్రలు, వుండే గృహము ఉపయోగపెట్టే సమస్త పదార్థములు కూడను పరిశుద్ధముగావుంటుండాలి. ఇదే ద్రవ్యశౌచము అన్నారు. నిత్యజీవితములో మనము యేయే పదార్థములు యెప్పుడెప్పుడు యే విధముగా ఉపయోగపెట్టుకుంటున్నామో ఆ ఉపయోగ పెట్టుకునే పదార్థములన్నీ పరిశుద్ధముగా ఉండాలి. ఇంక మానసిక శౌచము. రాగద్వేషములకు యే మాత్రము అవకాశమివ్వకుండా, ద్వేష అసూయాది దుర్గుణములకు స్థానమివ్వకుండా తనకు అపకారము చేసినవానికికూడను ఉపకారము చేసే విశాలభావము పెంచుకొని యెలాంటి పరిస్థితులయందుకూడను యితరులను నొప్పించకుండా వుండే గుణమును కల్గివుండటమే యీ మానసికశౌచము. క్షణక్షణము కూడను మనము ఇతరుల హృదయాలను బాధింపచేస్తున్నాము. ఇతరులను దూషిస్తున్నాము. ఇతరుల హృదయాలను గాయం చేస్తున్నాము. ఇతరుల మంచిని చూచి ఓర్వలేక పోతున్నాము. మనకంటె ఉన్నతస్థాయిలో ఉన్నవారిని చూచి కుళ్ళుతున్నాము. ఇదే మానసికమైన మాలిన్యము. ఇట్టి మాలిన్యము మనసులో చేరినపుడు యింక వాడు మానవుడే కాదు, దానవుడుగా రూపొందుతాడు. కనుక మనము నిజమైన మానవునిగా నిరూపించవలెనంటె పవిత్రమైన మనస్సును అభివృద్ధిపరచుకోవాలి. అందరియందువుండిన దైవత్వము ఒక్కటే అనే

sri sathyasai vachanamrutam

సత్యాన్ని గుర్తించాలి. నా హృదయములో యెట్టి ఆత్మవున్నదో, ఎట్టి పవిత్రమైన శక్తికలదో అదే శక్తి, అదే ఆత్మ ఎదుటి మానవునిలోకూడ వున్నదనే సత్యాన్ని గుర్తించాలి. అట్టి ఏకాత్మ భావమును గుర్తించిన వాని మనస్సే పరిశుద్ధముగా వుంటుంది. అట్లుకాక తనకు అవసరమైన విషయములందు మాత్రము తాను ద్వేషమును, కక్షను సాధించకుంటూ రాక్షసునిగా రూపొందటమనేది మానవత్వానికి విరుద్ధమైనది.

ఇంక వాక్‌శౌచము. అనగా సత్యమును పలకాలి. మృదు మధురముగా మాట్లాడాలి. నొప్పింపక, తానొవ్వక తప్పించుకు తిరిగే యుక్తికి మనము పూనుకోవాలి. అతి భాష మనము మాట్లాడరాదు. పరదూషణ చేయరాదు. అసత్యము, అతి భాష, పరదూషణ, నింద, ఇతరులను బాధించే దుష్టపలుకులు లేకుండా చేసుకోటమే వాక్‌శౌచము. మనము యీనాడు వాక్కును అతిగా మలినము గావించుకొనుచున్నాము. ఎప్పుడు చూచినా యితరులయొక్క చెడ్డనే మనము చింతిస్తున్నాము, పలుకుతున్నాము. ఇతరులను నిందిస్తున్నాము. అతి భాష మాట్లాడుతున్నాము. ఇంతే కాదు, మాటలలో ఖడ్గమువలె కటువును ఉపయోగపెడుతున్నాము. ఈ కఠినమైన మాటలుకూడను మన మాలిన్యమును అభివృద్ధిపరుస్తాయి. ఇది మానవునికి సరైన మార్గముకాదు.

ఇంక శరీరశౌచము. జలముతో పరిశుద్ధము చేసుకోవాలి. ఈ విధమైన ద్రవ్యశౌచము, మానసిక శౌచము, వాక్‌శౌచము, దేహశౌచము ఈ నాల్గు విధములైన శౌచములు మనము ఆచరించినప్పుడే క్షమ అనే గుణమునకు కొంతవరకైన అవకాశము లభిస్తుంది. ఈ క్షమ మన కంటికి కనుపించేదికాదు. ఒకనొక సమయములో అడవి యందునప్పుడు భీముడు, ద్రౌపది ధర్మజుని దగ్గరకు వచ్చారు. మనకు శతృవులైన వైరుల విషయంలోపల మనము ఏ విధానమును యోచిస్తున్నామని ప్రశ్నించారు. ఈ భీముడు, ద్రౌపది వేసిన ప్రశ్నలకు ధర్మజుడు చిరునవ్వు నవ్వి వారికి శాంతి వచనములు చెప్పి అసలు మనకు శతృవులనేవారే లేరు. మనయొక్క గుణములే మన శత్రువులు. మన కర్మలే మన శత్రువులు. మన ప్రవర్తనే మన శత్రువులు. కనుక శత్రువులైన దుష్ప్రవర్తన, దుర్భావములు దుర్గుణములను మనము జయించటానికి ప్రయత్నించాలని బోధించాడు. మన దుష్టభావములే మనలో ప్రతిబింబించి అవి ఎదుటి

sri sathyasai vachanamrutam

మనిషిలో వున్నట్లు మనకు కన్పిస్తున్నాయి. మనయొక్క బింబము అందులో ప్రతిబింబముగా కన్పిస్తుంది. అంతేకాని అద్దములో వేరొక వ్యక్తి లేడు. అట్లనే మనయొక్క భావములు మరొకని హృదయములో మనము చూసుకుంటూ దానినే మనము ప్రతిబింబింప చేసుకుంటూ ఈ దోషములన్నీ అతనివని మనము నిరూపిస్తూ వస్తున్నాము. కనుక "మనకు విరోధులెవ్వరూ లేరు భీమా! కౌరవులు మనకు విరోధులని భావిస్తున్నాము. కాదు, కాదు, మన భావములయొక్క దోషములే! మన హృదయములో మంచిగా భావించుకుంటే వారు మనకు మిత్రులే, సోదరులే", అని బోధించాడు. 'కూరిమిగల దినములలో నేరములెన్నడును కలుగనేరవు, మరి ఆ కూరిమి విరసంబైన నేరములే తోచుచుండు'. మైత్రీ భావము మనలో వుంటున్నప్పుడు వాడు మనలను కొట్టినప్పటికిని వాడు మనకు మిత్రుడే, ఏదో తమాషాగా కొట్టాడు, జోక్‌గా కొట్టాడు, వాడు కొట్టటంచేత నా రక్తము చక్కగా సరఫరా జరిగింది. మసాజ్ చేసినట్లయింది. బాధలన్నీ తగ్గాయని మంచి భావముతో ఉపయోగపెడుతూ వుంటాము. వాడంటే విరోధమైన భావం మనలో చెలరేగిందంటే వాడు ఎక్కడోపోతూ దారిలో యింత ఉమ్మివేసినా నన్ను చూసే వాడు ఉమ్మివేశాడనే ద్వేషభావము మనలో ఉప్పొంగుతుంది. ఈ మిత్రత్వమునకు, ఆశతృత్వమునకు మనయొక్క హృదయములే కారణంగాని ఇతరులు కాదనే సత్యాన్ని మనం గుర్తించాలి. తనకోపమే తనకు శత్రువు. తన శాంతమే తనకు రక్ష. దయచుట్టంబౌ! తన సంతోషమే స్వర్గము. తన దుఃఖమె నరకమందురు. కనుక, ప్రతి ఒక్కటికూడను బయట చూస్తున్నవి, బయట అనుభవించే మంచి చెడ్డలు రెండూకూడను మననుండి ఆవిర్భవించిన ప్రతిబింబములే కాని అన్యములు కావు.

ఒకనొక సమయములో విదురుడు ధృతరాష్ట్రునిదగ్గరకు వెళ్లాడు. "ధృతరాష్ట్రా! నీకు కేవలము చర్మ చక్షువులు లేకపోవటమే కాదు. జ్ఞాన చక్షువులంతకంటె లేవు" అని అతని మనస్సులో సూటిగా నాటుకొనిపోయేటట్లుగా కొన్ని కఠిన వాక్యములు ప్రవేశపెట్టాడు". నీవు పాండు పుత్రులను మహర్షులయొక్క సాక్ష్యముతో అంగీకరించావు. పాండురాజుకు ఈ ఐదుమంది పుత్రులు పుట్టినది ఎవ్వరికి తెలియదు. మహర్షులయొక్క వాక్యములపైన విశ్వాసముతో వీరు పాండురాజు కుమారులని నీవు అంగీకరించావు. ఇంతే కాదు దివ్యదృష్టివుండిన భీష్మునియొక్క దృష్టిచేతను, వాక్యముచేతను వారిని అంగీకరించి నీ చెంతపెట్టుకున్నావు. అయితే వీరి క్షేమము, వీరి అభివృద్ధి నీ కుమారులు అంగీకరించటం లేదు. నీ కుమారులు దుష్టులు, దుర్మార్గులు.

srisathyasaivachanamrutam

ధర్మమూర్తులైన పాండవులను హింసించటానికి పూనుకుంటున్నారు. పుత్ర వ్యామోహంచేతను, అభిమానముచేతను, పుత్రులపైన వున్న మమత్వంచేతను నీవు పెడమార్గము పడుతున్నావు. విషరసము గ్రోలినవాడు ఒక్కడు మాత్రమే మరణిస్తాడు. కాని రాజతంత్రమునందు మనస్సు వికృత మార్గము పట్టినపుడు రాజ్యమే క్షీణించిపోతుంది. ప్రజలంతాకూడను నశిస్తారు. రాజుకూడను నాశనమవుతాడు. చేతులారా ఎందుకు నీవు ఈ దుర్బోధలచేత, దుర్గుణముచేత నీ రాజ్యమును మట్టిపాలు గావించుకుంటావు? నీ వంశమునంతాకూడను నాశనం చేసుకుంటున్నావు. ఇది సరియైనది కాదు. సత్యాన్ని గుర్తించ"మని చెప్పి హెచ్చరించాడు. తన ఆవేదనను సహించుకొనలేక ఆవేశంచేత యింకా కొన్ని కొన్ని మాటలాడుతూ వచ్చాడు. "నీవు జ్యేష్ఠ పుత్రుడవనే భావంచేతను, తనకు రాజ్యము కావాలనే భావము లేకపోవటంచేతను పాండురాజు నీకు పట్టముగట్టాడు. పుట్టుగ్రుడ్డువానికి, పుట్టు చెవిటివారికి, పిచ్చివానికి, స్థిరత్వములేనివారికి రాజ్యాధికారము లేదు. ఎప్పుడు యిలాంటి రాజులంతా రాజ్యమేలుతారో ఆనాడు సర్వస్వము ధ్వంసము చేసుకుంటారు. ఇలాంటి నీకు రాజ్యము కట్టబెట్టటంచేతనే చేతులార నిన్ను నీవు ధ్వంసము చేసుకుంటున్నావు. ధర్మజునియందు క్షమ అనే గుణం చాలా వుంది. ఆ క్షమాగుణమును చూసి నీవు ధర్మజుడు పిరికివాడని భావిస్తున్నావు. అయితే క్షమాగుణము పైకి కన్పించేదికాదు. ఇది శాంతి ఖడ్గము. ధర్మజునియొక్క శిరస్సుకు ఇది ఒక కిరీటము. ఏ క్షణములో యీ యొక్క క్షమ నిన్ను హతం చేస్తుందో చెప్పటానికి వీలులేదు దానిని నీవు పిరికితనంగా భావించి వారిని హింసించటానికి పూనుకుంటున్నావు. అతిశీఘ్రకాలములోనే పాండవుల యొక్క క్షమాగుణము నిన్ను సర్వనాశనం గావిస్తుంది", అని విదురుడు ధృతరాష్ట్రుని హెచ్చరించాడు. అతను చెప్పినట్టుగానే పాండవులయొక్క క్షమాగుణమే వారికి విజయమును సాధింపజేసింది. అప్పుడే పాండవులయొక్క పవిత్రమైన శక్తి సామర్థ్యములుకూడను జగత్ వ్యాప్తి అవుతూ వచ్చాయి. క్షమకు మూలాధారమైనవి ఈ నాల్గుశౌచములు.

## సదాచారమే, సత్ప్రవర్తనయే ధర్మము

ఈ శౌచములకు ప్రధానమైన ఆధారమే ధర్మము. అయితే యీ ధర్మము నుండే సత్యము ప్రారంభమవుతుంది. సత్యమునుండి తిరిగి ధర్మము ప్రారంభమవుతుంది. విత్తనమునుండి

sri sathyasai vahini

చెట్టు, చెట్టునుండి విత్తనము. ఈ ధర్మసత్యములు రెండుకూడను ఒకదాని నొకటి పెనవేసుకున్న అన్యోన్యాశ్రయములు. 'సత్యా న్నాస్తి పరోధర్మః' కనుక, యీ సత్య ధర్మములయొక్క స్వరూపమును మానవుడు ధరించాలి. దీనినే మానవుడు వరించాలి. ఈ రెండింటి ఆధారముతోనే జగత్తును భరించాలి. సన్మార్గములో తరించటానికి ప్రయత్నించాలి. తరించటానికి మార్గములు సత్యధర్మములే! ధర్మమనగా సదాచరణము. మనయొక్క ప్రవర్తన సక్రమమైనదిగా వుండాలి. ఏదో ధర్మమంటే 'ధారయతీతి ధర్మః' 'ధర్మోరక్షతి రక్షితః' అని అనేక రకములుగా మనము శ్లోకములు చెప్పవచ్చును. కానీ, సరైన ధర్మము యేమంటే సదాచారమే, సత్ప్రవర్తనే! ఈ ప్రవర్తన సక్రమమైనదిగా వుండినప్పుడు వారియొక్క జీవితము శాంతివంతమైన జీవితముగా వుంటుంది.

మనము పల్లెలలో లేక పట్టణములలో ప్రవేశించి ధర్మప్రబోధ అనగా 'పరులను దూషించవద్దు, పరులకు చెడ్డ చేయవద్దు, పరులకు హానిచెయ్యవద్దు. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించుకో, హృదయాన్ని పవిత్రము గావించుకో'! అనేవి వారికి బోధించాలి. ఈనాటి మానవులయొక్క మనస్సులు మహామాలిన్యముతో కప్పబడి, మహామాలిన్యముతో నిండివున్నవి. చేప జలములో సంచరిస్తూ వుంది. వున్నది జలములో, తిరిగేది జలములో, జీవించేది జలములో, పుట్టేదిజలములో, నశించేది జలములో. ఈ విధముగా మనము నిరంతరంకూడను దుష్టక్రియలలో పాల్గొంటున్నాము. ద్వేషము అనేది చాలాశత్రువు. ఎవరికి మనం చెడ్డను చేయరాదు. చెడ్డను కోరరాదు. ఇది ఏదో ఎవరికో మనము చేస్తున్నాము. ఎవరికో మనము కోరుతున్నామని అనుకుంటున్నాము. కాదు కాదు, ఈనాడు నీవు నవ్వుతూ నవ్వుతూ ఇతరులకు చెడ్డ చేసినప్పుడు రేపటి దినము నీవు యేడుస్తూ యేడుస్తూ అనుభవించవలసివస్తుంది. భవిష్యత్తును లక్ష్యములో పెట్టుకొని వర్తమానములో జీవితాన్ని గడపాలి. దివ్యమైన భావములను దృష్టిలో పెట్టుకొని వర్తమానమనే క్రియలో మనము జీవితము గడపాలి. లక్ష్యము దివ్యత్వము, క్రియ జగత్ తత్త్వము. ఈ విధముగా సర్వకర్మలు భగవత్ ప్రీత్యర్థము గావించినప్పుడే మన జీవితము సార్థకమవుతుంది.

**మనయొక్క దుఃఖమునకు ఆనందమునకు, మోక్షమునకు కూడా మనస్సే కారణం**

srisathyasaivahini.org

ఎందుకోసం పుట్టాము? ఎందుకోసం జీవిస్తున్నాము? ఎందుకోసం నశిస్తూన్నాము? ఈ విధముగా మనలో మనం ప్రశ్నలు వేసుకుంటే వీటన్నింటికి మూలకారణం మన మనో భావములే అని తెలుస్తుంది. కనుకనే "మనయేవ మనష్యాణాం కారణం బంధమోక్షయోః" అన్నారు. మనయొక్క దుఃఖమునకు, మనయొక్క ఆనందమునకు, మనయొక్క మోక్షమునకు మన మనస్సే కారణము.

**పరుల తిట్టినంత పాప ఫలం బబ్బు**
**పరులు పరులు కాదు పరమాత్ముడగునయా.**

నీ పరమాత్మనే నీవు దూషిస్తున్నావు. పరులను బాధిస్తున్నావు. ఇదియే పెద్ద అజ్ఞానము. "ఏకోవసి సర్వభూతాంతరాత్మ". అలాంటి దివ్యభావాన్ని మనము అభివృద్ధిపరచుకోవాలి. ఆ దివ్యభావాన్ని పదిమందికి పంచాలి. ధర్మమార్గాన్ని పెంచాలి. అప్పుడే నీవు దివ్యత్వాన్ని పొందగలవు. జీవితములో మనందరము యేదో ఒక విధమైన మార్గములో ప్రయాణిస్తూనే ఉంటాము. ఒకరు సన్యాసులు కావచ్చు. వేరొకరు సంసారి కావచ్చు. 'నేను సంసారి సంసారి' అని అనుకోవటంకూడను తన భావమే! 'నేను సన్యాసి సన్యాసి' అనుకోటం కూడను తన భావమే! తలంపులు తగిలించుకోటమేగాని తలలో వున్న భావములను మనము వదుల్చుకోటానికి ప్రయత్నించటం లేదు. కనుకనే

**కాషాయ వస్త్రంబు కట్టిన మాత్రాన**
**కరతలామలకంబుగాదు భక్తి**
**నోటితో మంత్రంబు నుచ్చరించిన యంత**
**పరతత్త్వ మహిమంబు పట్టువడదు**
**గీతను చేబట్టి కేకలు వేసిన**
**పుణ్యము మనయింట ప్రోగుపడదు**
**చెప్పు మాటలకు చేసెడి చేతలకు**
**సామ్యముండెడివాడె సాధువగును.**
**అహము పరనిందయను పాదుకుళ్లుతీసి**

srisathyasaivachanamrutam

**సర్వజీవులందు సర్వేశ్వరుండు ఒక్కడే అన్న**
**భావంబు మదియందు నిలుపుకొన్ననాడె**
**సాధు సంఘంబు అభివృద్ధిగాంచునయ్యా**

సాధువులనగా ఎవరు? కాషాయ వస్త్రము వేసుకున్నవారేకాదు. అందరూకూడా సాధువులే. సాధుత్వమనేది సర్వజీవులయందు వుంటుంది. ఆ సాధుత్వాన్ని మనము పెంచుకోవాలి. సాధువేషాన్ని కాదు. మనలో పవిత్రమైన భావాలను పెంచుకోవాలి. ఈ పవిత్ర భావములచేతనే నిజమైన సాధుత్వము నిరూపిస్తుంది. కనుక, మనము సాధువులు కానక్కరలేదు. వేషాలు ధరించనక్కరలేదు. హృదయాన్ని పవిత్రం చేసుకోవాలి.

**మొట్టమొదట మనలో ఉండిన దుర్గుణములను మనం దూరం చేసుకోవాలి**

రావణాసురుడుకూడను సాధువేషము ధరించాడు. సీతను అపహరించాడు. కాబట్టి అక్కడ వేషమా, దుష్టగుణమా మూలకారణము? దూరము చేసుకోవాలి, దుర్గుణములను. ఇది ఈనాడు జగత్తులో సర్వవ్యాపకత్వము పొందాలి. ప్రతి మానవుడు తనయందు వుండిన దుర్గుణములను దూరం చేసుకోవాలి. అట్టి దుర్గుణాలను దూరం చేసుకోకుండా ఎన్ని జపములు చేసి, ఎన్ని తపములు చేసి, ఎన్ని యజ్ఞములు చేసి, ఎన్ని యాగములు చేసి, ఎన్ని వేదములు వుచ్చరించి, ఎన్ని శాస్త్రములు పఠించినప్పటికి యేమీ ప్రయోజనము లేదు. కనుకనే మొట్టమొదట మనలో వుండిన ఆ దుర్గుణాలను మనం దూరం చేసుకోవాలి. ఏ కించిత్ ఉపకారం చేసినప్పటికిని అదే గొప్పగా అభివృద్ధి అవుతుంది. పూర్ణ విశ్వాసాన్ని మనం పెంచుకోవాలి. అది బాల్యమునందే మనకు ప్రారంభమవుతుంది. 'పెరుగుతూ పెరుగుతూ పెద్దబావ కోతియాయె' అన్నట్లుగా మన బుద్ధులన్నీ కోతి రూపాన్ని ధరిస్తుంటాయి. ఒక చిన్న కథవుంది.

**నిస్వార్థ నిర్మల హృదయముతో మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తే ఎవరో ఒకరి ద్వారా ఆయన మన కార్యమును సఫలము గావిస్తాడు**

ఒక తల్లి, కుమారుడు యిరువురూ జీవిస్తూవచ్చారు. వీరికెవ్వరూ ఆధారము లేరు. కుమారుడు పుట్టిన తక్షణమే తండ్రి మరణించాడు. అది బీద కుటుంబము. ఆ పిల్లవానిని యేదో ఒకరీతిగా అభివృద్ధి గావించుకొని వాని జీవితానికి తగిన ఆధారము కల్పించాలని తల్లి

sri sathyasai vachanamrutam

ఆశపెట్టుకుంది. పిల్లవాడు ఒకటవ తరగతిలో చేరాడు. క్రమంగా ఐదవ తరగతికి వచ్చాడు, ఆరవ తరగతికి వచ్చాడు, పదవతరగతి వరకు వచ్చాడు. మంచి మార్కులతో ఉత్తీర్ణుడౌతూ వచ్చాడు. ఈ పదవ తరగతిలో పబ్లిక్ పరీక్షలు వస్తున్నాయి. దానికి కొంత ఫీజు కట్టాలి. ఫీజు కట్టకుండా పోతే స్కూలులో పరీక్షకు కూర్చోనివ్వరు. తల్లి పోయి ఆ హెడ్మాష్టరును ప్రార్థించింది. 'అమ్మా! యిది నేను యేమీ చేయటానికి వీలులేదు. గవర్నమెంటు రూల్సు ఆ రీతిగా వున్నాయి. తొంభై రూపాయిలు తెచ్చి మీ కుమారునికి కట్టాలి', అని చెప్పాడు. చేతిలో ఒక్క కాసులేదు. ఏ కూలి చేసినప్పటికి తొంభైరూపాయలు సంపాదించే శక్తి ఆమెకు లేదు. ఆమె ఒకనాడు చెట్టుక్రింద కూర్చొని యేడుస్తోంది. 'నా వలెనే నా కుమారుని జీవితము వ్యర్థమవుతుందే', అని బాధపడుతోంది. పిల్లవాడు పరుగెత్తుకొని వచ్చాడు. అమ్మ ఏడుస్తోంది. 'అమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు? 'అని ప్రశ్నించాడు. పిల్లవానికి చెప్పటం తనకు ఇష్టం లేదు. కాని ఎంతకీ ఈ పిల్లవాడు వదల్లేదు. కడకు వున్న సత్యాన్ని చెప్పుకుంది. 'నాయనా! నిన్ను చదివించే అవకాశము లేదు. నీవుకూడా నాతో వచ్చి కూలి పని చేయవలసివస్తుంది. అదే నా బాధ', అంది. 'నేను బాగా చదువుతాను. నేను స్కూలుకు పోతాను. నేను చదువుమాననను,' అన్నాడు, పిల్లవాడు. ఇప్పుడు 10వ తరగతి పరీక్షకు నీకు తొంభై రూపాయిలు ఫీజు కట్టాలి. మీ హెడ్మాష్టరుగారు చెప్పారని చెప్పింది. ఆ పిల్లవాడు పరిపూర్ణవిశ్వాసముతో వున్నాడు. అమాయకత్వముతో వున్నాడు. ఏ విధమైన కుట్రలు అతనికి తెలియవు. నిర్మల హృదయముతో ఆ పిల్లవాడు తల్లి యేమి చెబుతే దానిని దివ్యవాక్యముగా తాను అనుసరించటానికి సిద్ధంగా వున్నాడు. 'అమ్మా తొంభై రూపాయలు ఎవరైన వున్నవారితో ఇప్పిస్తే తరువాత నేను దానిని తీర్చుకుంటా' నన్నాడు.'నాయనా! మనకెవరూ దిక్కులేరు. ఇలా దిక్కులేనివారికి దేవుడే దిక్కు' అంది. అతను ఎక్కడ వుంటాడు? అమ్మా!' అని అడిగాడు ఈ పిల్లవాడు. 'అతను సర్వవ్యాపకుడు, మహాశక్తి సంపన్నుడు. సకలైశ్వర్య స్వరూపుడు. అతని దగ్గర వున్నంత డబ్బు మరెవరి దగ్గర లేదు. జగత్తునకంతా అతనే యిస్తున్నాడు. అతడే అన్ని విధముల స్వీకరిస్తున్నాడు' అని తల్లి చెప్పింది. పిల్లవాడు అమ్మ కాళ్ళుపట్టుకుని 'అమ్మ! దేవుడు ఎక్కడున్నాడో చెప్పు. తప్పక నేను వెళ్ళి అతని కాళ్ళుపట్టుకొని ప్రార్థించుకొని యేరీతిగానైన తొంభైరూపాయిలు ఇప్పించుకుని వస్తా' నన్నాడు. 'నాయనా! నారాయణుడే దేవుడు, వైకుంఠములో వుంటాడు' అని తల్లి చెప్పింది. సరే, అతని

sri sathyasaivahini.org

జేబులో యేదో కొన్ని కాసులుండినాయి. పోస్టాఫీసుకు పోయినాడు. ఒక కవరు తీసుకున్నాడు. నారాయణునకు అని పేరు వ్రాసి, వైకుంఠము అని అడ్రసు వ్రాసాడు. ఈ కాలము పిల్లలవలె 'వైకుంఠమంటే ఎక్కడుంది, నారాయణుడంటే ఎక్కడ వున్నాడు, అది అంతా గ్యాస్', అని వాదించలేదు. పాపం, తల్లి చెప్పిన మాటలు చక్కగా విన్నాడు, విశ్వసించాడు. పోస్టుబాక్సువద్దకు పోయాడు. ఆ పోస్టుబాక్సు ఒక పిల్లర్‌పైన ఎత్తుగా పెట్టారు. ఆ పిల్లవానికి వేయటానికి అందలేదని ఎగిరెగిరి వేస్తున్నాడు. కాని అది లోపల పడలేదు. కిటికీలోనుండి పోస్టు మాస్టరు చూచాడు. వచ్చి పాపం పిల్లవాడు యేదో పోస్టు చేస్తున్నాడు, అందలేదని చెప్పి దగ్గరకు వచ్చి 'యేమి నాయనా! ఎక్కడ? ఎవరికి వేస్తున్నావు ఈ జాబు?' అని అడిగాడు. 'సార్! ఇది చాలా అర్జంటు, సార్! రేపటి దినమే నేను పరీక్షఫీజు కట్టాలి. కాబట్టి ఈ ఉత్తరం త్వరగా పోయి చేరాలి. దీనికేదైనా సహాయం చేయండి' అన్నాడు. సరే! నేనువేస్తాను, యిలాతే నాకు అందుతుంది అని చేతికి తీసుకున్నాడు, పోష్టుమాష్టరు. చూస్తే పైన 'శ్రీమన్నారాయణుడు, వైకుంఠము' అని ఎడ్రస్సు వుంది. 'ఈ ఎడ్రస్సు ఎవరిచ్చారు నాయనా!' అని అడిగాడు పోస్టుమాస్టరు. 'మా అమ్మ చెప్పింది. నాకు చేతిలో కాసు లేదు, నాకు చదువుకోవాలని ఆశవుంది ఇప్పుడు తొంభై రూపాయిలు ఫీజు కట్టాలి. అతను చాలా శ్రీమంతుడు. అతను సకలైశ్వర్యస్వరూపుడట! అతనిని నేను ప్రార్థిస్తున్నాను. అందువల్ల వ్రాసుకున్నాను', అని చెప్పాడు, పోస్టుమాస్టరుకు. ఆయన కంటివెంట నీటిధారలు కారాయి. ఎంత అమాయకుడు ఈ పిల్లవాడు! ఎంత నిర్మల హృదయుడు! ఎంత పవిత్ర హృదయుడు! అని అతను చాలా బాధపడి అబ్బాయికి చెప్పాడు : 'నాయనా! ఈ కవరు నేను పోస్టు చేస్తాను. రేపటి దినము తొమ్మిది గంటలకు నీవురా. అతని దగ్గరనుండి డబ్బు వస్తుంది. నీవు తీసుకొని పోవచ్చు,' అన్నాడు. సరే ఇంటికి పోయి ఎగురుతూవున్నాడు. 'రేపటి దినము నేను ఫీజు కట్టేస్తానమ్మా' అని అన్నాడు. ఆ తల్లి యేదో హాస్యము అనుకొని యేమి చెప్పటానికి వీలులేక తాను నవ్వుకుంటూ వుంది. ఎప్పుడు రేపు తెల్లవారుతుంది అని కాచుకున్నాడు. తెల్లవారిందోలేదో వెళ్లాడు, పోస్టు మాస్టరు దగ్గరకు. 'సార్! పదిగంటలకు ఫీజు కట్టాలి, అక్కడనుండి యేమైన వచ్చిందా?' అని అడిగాడు. 'ఆ! వచ్చింది నాయనా! కాసేపు కూర్చో' అని లోపలికి వెళ్లి తొంభైరూపాయిలు కవరులో పెట్టి 'యిదుగో నీకోసం వచ్చింది, తీసుకో!' అని చెప్పాడు. ఆ కవరు తీసుకొని వాళ్లమ్మ దగ్గరకు వెళ్లాడు. 'ఇదుగో

sri sathyasaivachanamrutam

అమ్మా! డబ్బు వచ్చింది,' అన్నాడు. తల్లికి చాలా ఆశ్చర్యము వేసింది. 'ఎక్కడైన దొంగతనం చేశాడా లేకపోతే ఎవరినైనా అడిగాడా? యింకే విధముగానైనా పేరు ప్రతిష్ఠలను పాడుచేసుకున్నాడా! నా కుటుంబముతో గుట్టుగా నేను జీవిస్తున్నాను. నా మర్యాదను పాడుచేశాడేమో' నని బాధపడుతూ ఆ పిల్లవానిని ఈ డబ్బు ఎవరిచ్చారో వారి దగ్గరకు తీసుకుని వెళ్లమంది. ఈ అబ్బాయి వున్నది వున్నట్లుగా 'ఆ నారాయణుడు నాకు పంపించాడు. అంతేగాని, నేను ఎక్కడా దొంగతనము చేయలేదు. ఎవరినీ నేను అడగలేదు, అని సత్యాన్ని పలికాడు. పోస్టుమాస్టరు వద్దకు వచ్చి ఆమె 'నాయనా! యిదంతా నిజమేనా?' అని అడిగింది. అప్పుడు పోష్టుమాష్టరు 'అమ్మ! ఇది భగవంతుడే పంపించాడు. లేకుంటే నా హృదయము కఠినమైనది. ఆ అబ్బాయి జాబును చూచిన తక్షణమే భగవంతుడే నాకు ఆ భావము కలిగించాడు. అతనే యీ డబ్బును యిప్పించాడు. అంతేగాని నేను చేసింది కాదు. నేను నిమిత్తమాత్రుడిని' అన్నాడు. ఏతావాతా దీనియొక్క అర్థమేమంటే నిర్మలమైన హృదయముతో నిస్వార్థమైన మనస్సుతో సందేహమునకు తావివ్వకుండా మనము భగవంతుని ప్రార్థిస్తే యేదో ఒక హృదయమును మార్పుచెందించి మనయొక్క కార్యమును సఫలం గావిస్తాడు.

**భగవంతుని ప్రార్థించాలంటే నీవు పసిబిడ్డగా మారిపోవాలి**

'దేవుడు ఎక్కడ వున్నాడు? దైవమెక్కడ వున్నాడు? యిదంతా వట్టి పిచ్చి,' అని యీ విధమైన వాదోపవాదములలో ప్రవేశపెడితే వున్నదానిని కూడను పోగొట్టుకుంటాడు. అందుకోసమే రామకృష్ణుడుకూడా చెప్పాడు. 'భగవంతుని నీవు ప్రార్థించాలంటే పసి బిడ్డమాదిరి కావాలి'. జీసస్ కూడను అంతే! చిన్న బిడ్డలను చూచి వారి దగ్గరకు పోయి వారిని ముద్దాడేవాడు. అంతేకాదు, 'నేను కూడను దినమునకు ఒక్క క్షణమైనా యీ చిన్నబిడ్డ మాదిరి వుంటుంటే ఎంత పవిత్రుడను అయిపోయేవాడిని', అని అనుకునేవాడు. చిన్న పిల్లల హృదయాలన్నీ దైవహృదయములే! ఇలాంటి హృదయులుగా మనము తయారుకావాలి. తల్లి చెప్పిన మాటలు విశ్వసించాలి. తల్లులుకూడను చెడ్డ భావములు చెప్పకూడదు. ఈ విధమైన మార్గములో తల్లీబిడ్డలు అభివృద్ధి గాంచినప్పుడు జగత్తు నిత్యకళ్యాణము పచ్చతోరణముగా తులతూగుతుంది. కళకళలాడుతుంది. కిలకిల నవ్వుతుంది. ఈనాడు మంచితల్లులు, మంచిపిల్లలు అభివృద్ధి

sri sathyasai vahini amrutam

గాంచాలి. అప్పుడే మన భారతదేశాన్ని ఆదర్శవంతమైన దేశముగా మనము రూపొందింపచేసుకుంటాము. మన భావములు మారకుండా ప్రచార, ప్రబోధలు చేసినప్పటికిని ప్రయోజనము లేదు. ఎన్ని భజనలు చేసినా ప్రయోజనము లేదు.

**ఏది చేసినా భగవత్కర్మగా భావించండి**

పవిత్రమైన భావములను హృదయములో భద్రము చేసుకొని మనము సరైన సాధనలు సలుపుతూ రావాలి. ఈ బాధ్యతను వయస్సైపోయిన భూమానంద చేపట్టి యెంతనో శ్రమలుపడి యీ వయస్సులో అనేక విధములుగా తనకు తోచినట్లు ధర్మాలు ప్రబోధిస్తున్నాడు. ఆయనతోబాటు యీ సచ్చిదానంద, రామకృష్ణానంద, యింకా అనేకమంది సన్యాసులంతా చేరి యీ మార్గములోపల చాలా వుత్సాహముతో, ఉత్తేజముతో పనిచేస్తున్నారు. వీరి హృదయములు చాలా పవిత్రమైనవి. వారు నూతనమైన మార్గములో ప్రవేశించి యీ దివ్యమైనదీంట్లో దీక్షను బూని కాలమును సద్వినియోగము గావించి సార్థకత్వాన్ని అందుకుంటారని నేను ఆశిస్తున్నాను. ఏది చేసినా భగవత్కర్మగా భావిస్తూవుండండి. శరీరము ఒక నిమిత్త మాత్రముగా విశ్వసించండి. ఇదే నిజమైన సమాజసేవ. మనము యేదో జపము చేసుకుంటున్నాము, ధ్యానము చేసుకుంటున్నాము అంటే అది స్వార్థమే!

**తాను మోక్షంబు కోరుట స్వార్థమగును**
**తానె తరియింపగోరుట ధర్మమగునా?**

తనతోబాటు పదిమంది తరించాలనే విశాల భావము పెంచుకోవాలి. సంకుచితమైన భావము ప్రక్కకు నెట్టాలి. విశాలమైన ప్రేమను పెంచుకోవాలి. ఈనాడు మనము పెంచుకోవలసింది, యిదే! ఈ ప్రేమ లేకుండా ద్వేషముతో అసూయతో క్రోధముతో మన జీవితాన్ని వ్యర్థము చేసుకోకూడదు. మీరందరు ముఖ్యముగా నేడు గమనించవలసినది ఒకటి. మీరు ప్రచార, ప్రబోధలు చేస్తున్న విషయాలలో ఒకటి రెండైనకూడను మీరు ఆచరణలో పెట్టండి. అనేక వేలమైళ్లనుండి వచ్చిన ఎందరో అనేక విధములైన శాంతిని పొందుతుంటే సమీపములో వుండికూడను మీరు అశాంతిని అనుభవిస్తున్నారంటే నిజముగా యిది మీ దురదృష్టమనే చెప్పాలి. కమలముపైన కప్పలవలె వుంటున్నారుగాని ఎక్కడనుండో వచ్చిన తుమ్మెద ఆ



srisathyasaivachanamrutam

మాధుర్యాన్ని త్రాగిపోతున్నది. ఆ విధముగా మీరుకూడను జీవిత మాధుర్యమును త్రాగటానికి ప్రయత్నించాలి. సమీపముగా వుంటున్నారేగాని ఆ మాధుర్యాన్ని మీరు అనుభవించటము లేదు. అనుభవించాలని ఆశ మీలో అధికముగా ఉప్పొంగటము లేదు. ఇది సరికాదు. సరికాదు. ఇంకా రేపు, ఎల్లుండికూడను యీ ధర్మప్రచార ప్రబోధలయొక్క తత్త్వాన్ని తెలియజేయడానికి అనేకమంది సన్యాసులు వస్తున్నారు. వారుకూడా ఎంతో ఉత్సాహపూరితమైన హృదయముతో యీ ప్రచారము చేయటానికి కంకణం కట్టుకున్నారు. దీనిని మీరందరూ దిగ్విజయముగా సాధించగలరు. సాధించడానికి తగిన సౌకర్యములు స్వామి చేయగలడని హామీయిస్తూ నేను అనేక విధములుగా మిమ్మల్ని ఆశీర్వదిస్తూ యీ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ. 7-01-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam